# రైతుబంధు ఆపండి

మొదటిపేజీ తరువాయి...

పథకం అమలును కూడా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరింది.

**రైతులకు పెట్టుబడి సాయం అందకుండా కుట్ర..**

రైతులకు పంట పెట్టుబడికి ఇబ్బంది రావొద్దన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని అమలుచేస్తున్నారు. సీజన్ ప్రారంభానికి ముందే రైతుబంధు పంపిణీ చేస్తే రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసే పరిస్థితి రాదు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం రైతుబంధు పథకం ప్రధాన ఉద్దేశాన్ని దెబ్బతీస్తున్నది. రైతులు మళ్లీ ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వలలో చిక్కుకునేలా కుట్రలు చేస్తున్నది. ఇందులో భాగంగానే సీజన్‌కు ముందు అందించే రైతుబంధుకు మోకాలడ్డుతున్నది. ఎన్నికలను సాకుగా చూపుతూ.. కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయానికి ఒడిగడుతున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో వరి కోతలు మొదలయ్యాయి. దీంతో మరో నెల రోజుల్లో యాసంగి సీజన్ ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు పెట్టుబడి సాయం కోసం రైతుబంధు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ పథకం ఓటర్లను ప్రభావితం చేసేలా ఉందని ఆరోపించిన కాంగ్రెస్.. రైతుబంధును నామినేషన్లకు ముందు గానీ లేదా పోలింగ్ తర్వాత కానీ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరింది. అంటే సీజన్‌కు ముందు రైతులకు పెట్టుబడి సాయం అందకుండా కుట్ర చేసినట్టు స్పష్టమవుతున్నది.

**అన్నీ తెలిసే.. కాంగ్రెస్ కుట్రలు**

వాస్తవానికి ఎన్నికల నియమావళి ప్రకారం కోడ్ అమల్లో ఉన్నప్పుడు కొత్త పథకాలను ప్రారంభించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న పథకాలను అమలు చేయొచ్చు. ఈ విషయం కనీస రాజకీయ పరిజ్ఞానం ఉన్న ఎవరిని అడిగినా చెప్తారు. కాంగ్రెస్ పార్టీ ఈ విషయాలు తెలిసినా నీచ రాజకీయాలకు పాల్పడుతున్నది. ఇప్పటికే ఉన్న పథకాలు అమలు కాకుండా కుట్రలు చేస్తున్నది. రైతబంధు ఐదేండ్లుగా, దళితబంధు రెండేండ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇవేవో కొత్త పథకాలన్నట్టుగా కాంగ్రెస్ వీటిని అమలు చేయొద్దంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.

**దళితుల అభివృద్ధిని ఓర్వలేని కాంగ్రెస్**

కాంగ్రెస్ పార్టీ దళితబంధుపైనా విషం కక్కింది. దళితులు ఆర్థికంగా బలపడేందుకు ఉపయోగపడే దళితబంధును కూడా నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దేశంలో మరెక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, వారు స్వశక్తితో జీవించేందుకు దళితబంధుతో ఓ మార్గం చూపించారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే సుమారు 40వేల మం దికి 10 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. వారంతా ఆత్మగౌరవంతో సొంత వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు.

# కాంగ్రెస్‌ను నమ్మితే మునుగుడే

## ఐదు పద్దుల హామీలు బూటకం | సీఎం కేసీఆర్‌ను వదులుకోవద్దు

- మేం పడుతున్న గోస మీకొద్దు
- రేవంత్ నియోజకవర్గమైన కొడంగల్‌లో కర్ణాటక రైతుల ర్యాలీ
- కాంగ్రెస్ నేతలు అడ్డుకొని బెదిరించారని ఆగ్రహం



ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ కొడంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కర్ణాటక రైతులు

వికారాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ)/కొడంగల్: వచ్చే నెలలో తెలంగాణ శాసనసభకు ఎన్నికలు జరగనున్న వేళ రాష్ట్ర ప్రజలకు కర్ణాటక రైతులు అప్రమత్తతతో కూడిన హెచ్చరికలు జారీచేశారు. కాంగ్రెస్‌కు కనుక ఓటేస్తే నిండా మునుగుడు ఖాయమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగం కునారిల్లిపోతుందని పేర్కొన్నారు. తమను గెలిపిస్తే నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేస్తామంటే నమ్మి ఓటేశామని, ఇప్పుడు కష్టాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హామీలన్నీ బూటకమని, ఓట్లకోసమే ఆ పార్టీ అరచేతిలో స్వర్గం చూపిస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ సంక్షేమ, అభివృద్ధి పథకాలవంటివి దేశంలో ఎక్కడా లేవని, ఎట్టిపరిస్థితుల్లోనూ సీఎం కేసీఆర్‌ను వదులుకోవద్దని సూచించారు. తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీచేస్తున్న కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ఆ పార్టీ వైఖరిని ఎండగడుతూ కర్ణాటక రైతులు బుధవారం కదంతొక్కారు. గ్యారెంటీల పేరుతో చేసే మోసాన్ని నమ్మితే కాంగ్రెస్ నట్టేట ముంచుతుందని హెచ్చరించారు. తమలాంటి దుస్థితి రావొద్దంటే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 200 మంది కర్ణాటకలోని కొంతన్‌పల్లి, మల్లాబాద్, సిలార్‌కోట్రికె, నాడెపల్లి, పాకాల్ కానడగ్గ ప్రాంతాల రైతులు కొడంగల్‌లో శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి కర్ణాటకలో కాంగ్రెస్ వైఫల్యాలను వివరించారు. ప్లకార్డులు చేబూని, నినాదాలు చేశారు.

**కరెంటు లేదు.. బియ్యం లేవు**

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయినట్టే తెలంగాణలోనూ జరగవద్దనే తాపత్రయంతో నిజాలు వివరించడానికి వచ్చామని కర్ణాటక రైతులు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు అంటూ ఇచ్చిన హామీ సక్రమంగా అమలు కావడం లేదని, బస్సులో కొట్లాటతో ఇప్పటికే ఇద్దరు వ్యక్తులు చనిపోయారని చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగం కావాల్సిందేనని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వంలో కనీసం 8 గంటల కరెంటు ఉండేదని, కాంగ్రెస్ వచ్చిన తరువాత 3 గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నదని వాపోయారు. పేదలకు 10 కిలోల బియ్యం పంపిణీ చేస్తామని చెప్పి 3 కిలోలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. 200 యూనిట్ల కరెంట్ ఉచితమని చెప్తూ, ఆపై కరెంటు వాడితే రెండు రెట్లు ఆదనంగా బిల్లులు వసూలు చేసి రైతులను దోచుకొంటున్నారని మండిపడ్డారు. యువనిధి పథకం అమలు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ, హామీగానే మిగిలిపోయిందని, నేటి వరకు అమలుకు నోచుకోలేదని తెలిపారు.

**అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు**

కర్ణాటకలో తాము పడుతున్న బాధలను చెప్పుకోవడానికి వస్తే, కాంగ్రెస్ నాయకులు అడ్డుకొని ప్లకార్డులను విరగ్గొట్టారని కర్ణాటక రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. కర్ణాటకలోని కాంగ్రెస్ బాగోతం బయటపడుతుందనే భయంతోనే ఇలా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందే ఈ విధంగా దౌర్జన్యం నడుస్తుందని, అధికారంలోకి వస్తే కాంగ్రెస్ పాలన ఏవిధంగా ఉంటుందో తెలంగాణ ప్రజలు గుర్తించాలని కోరారు.

### కరెంటు లేక పంటలు ఎండుతున్నయ్



నా పేరు వెంకటయ్య. మాది మన్నాన్‌పల్లి గ్రామం. నాకు 6 ఎకరాల పొలం ఉన్నది. ప్రస్తుతం కంది, జొన్న పండిస్తున్నా. వర్షాల్లేక చెరువుల్లో నీళ్లు లేవు. బోర్లు ఉన్నా కరెంటు లేక పంటలకు నీళ్లు అందించలేకపోతున్నాము. దాంతో పంటలు ఎండిపోతున్నాయి. ఇంతకు ముందున్న ప్రభుత్వంలో కనీసం 8 గంటల కరెంటు వచ్చేది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రోజులో 3 గంటల కరెంటు మాత్రమే వస్తున్నది. ఎప్పుడు కరెంటు వస్తుందా అని ఎదురు చూస్తున్నాం. వచ్చే మూడు గంటలతో ఎకరం పొలానికి నీళ్లను అందించలేకపోతున్నాం.

*- వెంకటయ్య, మన్నాన్‌పల్లి గ్రామం*

### రైతులకు ఆత్మహత్యలే శరణ్యం



కాంగ్రెస్‌ను నమ్ముకున్నందుకు కర్ణాటక రైతులకు ఆత్మహత్యలే మిగిలాయి. నాకు మా గ్రామం అనంతపురంలో రెండున్నర ఎకరాల పొలం ఉన్నది. గతంలో పెసర, కంది పండించాను. తక్కువ పంట వచ్చింది. ప్రస్తుతం జొన్న వేశాను. వర్షాలు లేక, పొలంలో బోర్ ఉన్నప్పటికీ కరెంటు లేక పొలానికి నీటిని అందించలేకపోతున్నా. రైతులకు ప్రభుత్వం ఎటువంటి మేలు చేయడం లేదు. వ్యవసాయాధికారులూ అందుబాటులో ఉండరు. తెలంగాణలో మాదిరిగా రైతుల పంట కొనుగోలు కేంద్రాలు కర్ణాటకలో ఎక్కడా కనిపించవు.

*- శ్రీనివాస్, అనంతపురం గ్రామం*

# కరోనా కన్నా డేంజర్ కాంగ్రెస్

- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ కరోనా కన్నా ప్రమాదకరమని, ఈ విషయాన్ని తెలంగాణ రైతన్నలు గమనించాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునగడం ఖాయమని పేర్కొన్నారు. కరోనా విపత్తులోనూ సీఎం కేసీఆర్ ఎంతో ఉన్నతంగా ఆలోచించి రైతుబంధు ఆగనివ్వలేదని, రాష్ట్రంలోని ఏడు వేల పైచిలుకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొన్నారని గుర్తుచేశారు. కర్ణాటకలో అడ్డగోలు హామీలిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఆరు నెలలు కాకముందే వాటి అమలుపై చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో రైతుబంధు పంపి ణీ చేయొద్దని ఏఐసీసీ ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే.. ఎన్నికల సంఘానికి లేఖ రాయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుబంధు వద్దనడం కాంగ్రెస్ అనైతికతకు నిదర్శనమని విమర్శించారు. రైతన్నలు కాంగ్రెస్ నేతల కుట్రలను గమనించాలని కోరారు.

# రైతు, పేదల వ్యతిరేక పార్టీ కాంగ్రెస్

- రైతుబంధు నిలిపివేయాలని ఈసీకి లేఖ
- కాంగ్రెస్ వైఖరిపై దాసోజు శ్రవణ్ ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ రైతు, పేదల వ్యతిరేక పార్టీ అని, దాని కర్కశ వైఖరి ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే ఎన్నికల కమిషన్‌కు రాసిన లేఖతో స్పష్టమైందని బీఆర్‌ఎస్ సీనియర్ దాసోజు శ్రవణ్ విమర్శించారు. చిల్లర రాజకీయాల కోసం రైతుల జీవనోపాధిపై దెబ్బకొట్టడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి కానీ రైతులు వ్యవసాయాన్ని ఆపలేరని, రైతులను వేధించకూడదని హితవు పలికారు. రైతుబంధు నిలిపివేయాలని ఈసీకి రాసిన లేఖను కాంగ్రెస్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, భవిష్యత్తును స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బలిపెట్టకూడదని బుధవారం ట్విట్టర్‌లో సూచించారు. సీఎం కేసీఆర్ గొప్ప సంకల్పంతో దూరదృష్టితో ప్రారంభించిన రైతుబంధు కార్యక్రమం రైతులకు అత్యంత అవసరమని, దేశవ్యాప్తంగా స్ఫూర్తినిస్తున్నదని గుర్తుచేశారు.





- కాంగ్రెస్‌లో ఆగని టికెట్ల లొల్లి

*రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలై పక్షం రోజులు దాటినా కాంగ్రెస్ పార్టీలో టికెట్ల లొల్లి ఆగడం లేదు. అభ్యర్థుల ఖరారు కొలిక్కి రావడంలేదు. పార్టీని నమ్ముకొని ఏండ్ల తరబడి పనిచేసిన వారిని కాదని, పారాచూట్ నేతలకు టికెట్లు ఇస్తున్నారని ఆశావహులు ఆందోళనకు దిగుతున్నారు. తాజాగా ఇల్లందు కాంగ్రెస్ నేతలు సేవ్ కాంగ్రెస్ పేరుతో ఏఐసీసీ కేంద్ర కార్యాలయం ఎదుట బుధవారం టికెట్ ఆశిస్తున్న పీసీసీ కార్యదర్శి చీమల వెంకటేశ్వర్లు నాయకత్వంలో కార్యకర్తలు ఆందోళనకు దిగారు.*

*– హైదరాబాద్, నమస్తే తెలంగాణ*



స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న బైరాపూర్ గ్రామస్థులు

# స్పీకర్‌కు జైకొట్టిన బైరాపూర్ గ్రామస్థులు

బాన్సువాడ, అక్టోబర్ 25 : బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాల జోరు కొనసాగుతున్నది. తాజాగా కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని బైరాపూర్ గ్రామస్థులు స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతు ప్రకటించారు. ముదిరాజ్ సంఘానికి చెందిన 120 మంది, యాదవ సంఘానికి చెందిన 70, కురుమ సంఘానికి చెందిన 25 మంది, గౌడ కులస్థులు 25 మంది, వడ్డెర కులస్థులు 25 మంది, ముస్లింలు 25 మంది, నాయీ బ్రాహ్మణులు 25 మంది, కుమ్మరి, కమ్మరి, చాకలి కుటుంబాల వారు స్పీకర్ వెంటే ఉంటామంటూ ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ పదేండ్లలో పోచారం శ్రీనివాసరెడ్డి బైరాపూర్ గ్రామ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో స్పీకర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని చేసిన తీర్మాన ప్రతిని బుధవారం పోచారం శ్రీనివాసరెడ్డిని కలిసి అందజేశారు.

# నీచుడు, నికృష్టుడు, దుర్మార్గుడు!

- కమీషన్ల కోసం అమిత్ షా పంచన చేరాడు
- నిరుడు రాజగోపాల్‌పై రేవంత్ వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన తిట్లదండకం
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అవకాశవాదంపై నెటిజన్ల ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ): 'దుర్మార్గుడు, నీచుడు, నికృష్టుడు, కాంట్రాక్టర్.. వాడి పేరు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. అమిత్‌షా పక్కన చేరి కాంట్రాక్టులు, కమీషన్ల కోసం ఒప్పందం చేసుకున్నడు. అసలు వీడు మనిషేనా. అన్నం తినేటోడు.. అమ్మ మీద అభిమానం ఉండేటోడు ఎవడైనా ఇంత దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతాడా..' గత ఏడాది కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చదివిన తిట్ల దండకం. ఇప్పుడు అదే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మళ్లీ బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రకటించారు. దీంతో నాడు రాజగోపాల్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పార్టీలు మారిన సమయంలో నాడు కాంగ్రెస్ మీద, నేడు బీజేపీపై రాజగోపాల్‌రెడ్డి చేసిన విమర్శలు సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నాయి. ముఖ్యంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఆయన అప్పట్లో చేసిన ట్వీట్ ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్నది.

**సంవత్సరానికో పార్టీ.. పూటకో మాట**

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారంటూ.. ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తన స్వప్రయోజనాల కోసమే ఆయన పార్టీలు మారుతున్నారని మండిపడుతున్నారు. గత ఏడాది ఆగస్టులోనే ఆయన కాంగ్రెస్ నుంచి బయటికొచ్చి బీజేపీలో చేరారు. ఏడాది తిరిగేలోగా బీజేపీని పక్కనపెట్టి మళ్లీ కాంగ్రెస్ చేయి అందుకోనున్నారు. బీజేపీలో చేరినప్పుడు.. 'కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో ఆదరించే పరిస్థితి లేదు. ఆ పార్టీ దండగ' అంటూ విమర్శలు గుప్పించారు. 'రేవంత్‌రెడ్డి వంటి బ్లాక్‌మెయిలర్ కింద పనిచేయడం కన్నా రాజకీయాల నుంచి తప్పుకోవడం మేలు' అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు బీజేపీ నుంచి కాంగ్రెస్‌కు వచ్చేప్పుడు.. రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ లేదని అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. నాడు, నేడు కూడా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డినే ఉన్నారనే విషయాన్ని మర్చిపోయారా అంటూ నెటిజన్లు రాజగోపాల్‌రెడ్డిపై సెటైర్లు వేస్తున్నారు. ఆయన రాజకీయ స్వలాభం కోసం రాష్ట్రంలో మునుగోడు ఉప ఎన్నికను తీసుకొచ్చారని, అందుకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# అభివృద్ధి కొనసాగాలంటే సారే గెలవాలి

- కర్ణాటకలో ఐదు నెలల్లోనే వికటించిన కాంగ్రెస్ పాలన
- బీజేపీ పాలిత గుజరాత్‌లో ప్రజలకు తాగునీటి కటకట
- కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల



కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి గంగులను ఆప్యాయంగా పలకరిస్తున్న వృద్ధురాలు

కరీంనగర్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ సీఎం కేసీఆరే గెలవాలని బీసీ సంక్షేమం, పౌర సరఫరాల శాఖల మంత్రి, కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. తెలంగాణపై కేసీఆర్‌కు తప్పా మరో నాయకుడికి ప్రేమ ఉండదని స్పష్టం చేశారు. బుధవారం కరీంనగర్ మండలం బొమ్మకల్ నుంచి ఆయన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాకముందు ఎదుర్కొన్న పరిస్థితులను వివరించారు. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీకి ఓట్లు వేస్తే తిరిగి నాటి చీకటి రోజులు రావడం ఖాయమని హెచ్చరించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పాలన ఐదు నెలల్లోనే వికటించిందని, అక్కడ ఇస్తామన్న 24 గంటల కరెంట్ రావడం లేదని, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని అక్కడి రైతులు, ప్రజలు చెప్తున్నారని చెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి తాగునీళ్లు తెచ్చుకోవల్సిన దుస్థితి ఇప్పటికీ ఉందని, అదే తెలంగాణలో 24 గంటల కరెంట్, ఇంటింటికీ తాగు నీళ్లు సరఫరా చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని తేల్చి చెప్పారు. ఈ అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి సారే అధికారంలోకి రావాలని వివరించారు. తాను 15 ఏండ్ల సుదీర్ఘ కాలంగా ఎమ్మెల్యేగా ఉన్నానని, అది ఇక్కడి ప్రజల ఆశీర్వాదమేనని, మరోసారి గెలిపిస్తే కరీంనగర్‌ను మరింత అభివృద్ధి చేస్తానని మంత్రి గంగుల స్పష్టం చేశారు.



కొడంగల్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

# రేవంత్.. దమ్ముంటే నాపై గెలువు

- 2018లో ఓడినా బుద్ధిరాలేదా?
- కేసీఆర్‌తో పోటీ నీ తరం కాదు
- మంత్రి కేటీఆర్ దత్తతతోనే కొడంగల్ అన్ని రంగాల్లో అభివృద్ధి
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, అక్టోబర్ 25: 'సీఎం కేసీఆర్‌తో పోటీ చేయడం నీ తరం కాదు.. ముందు నాపై పోటీ చేసి గెలిచి చూపించు' అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సవాల్ విసరిరారు. బుధవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనతో పోటీ చేసి గెలిచే చరిష్మా లేదు కానీ.. సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా బుద్ధి రాలేదా? అని విమర్శించారు. కొడంగల్‌ను తానే అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్‌ను.. 2018లో ప్రజలు ఎందుకు ఓడించారో గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. రూ.300 కోట్లతో పీసీసీ పదవిని కొనుక్కొని.. ఇప్పుడు ఎన్నికల సమయంలో సీట్లను అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నట్టు సొంత పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారని చెప్పారు. రేవంత్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా.. 2018 నాటి ఫలితమే పునరావృతం అవుతుందని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వల్లే కొడంగల్ అభివృద్ధికి నోచుకున్నదని, మంత్రి కేటీఆర్ దత్తతతో వందల కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. నేడు నియోజకవర్గంలో ఎన్నో గ్రామాలు, తండాలకు బీటీ రోడ్లు వేసిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందని చెప్పారు.

### పాలేరులో కాంగ్రెస్‌కు మూడో స్థానం

**బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ**



ఖమ్మం, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడో స్థానం తోనే సరిపెట్టుకుంటుందని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్‌కు షర్మిలకు మధ్యే పోటీ ఉంటుందని తెలిపారు. మూడో స్థానంలో కాంగ్రెస్ ఉంటుందని జోస్యం చెప్పారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువులో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి తుమ్మల అధికారులపై చేసిన అహంకార పూరిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏడాదిలో భక్తరామదాసు ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు.



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సెగ్మెంట్ సోమగూడెంలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

# బీజేపీని మేమే ఓడిస్తాం

**తెగేసి చెప్తున్న అసంతృప్తవాదులు**

- టికెట్ రాకపోవడంపై నిరసనలు
- బెల్లంపల్లి సెగ్మెంట్‌లో రాస్తారోకో

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 25: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీలో లుకలుకలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సొంతపార్టీ పైనే ఎదురు తిరుగుతున్నారు. టికెట్ రానివారు సొంత పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు సిద్ధపడుతున్నారు. బెల్లంపల్లి బీజేపీ అభ్యర్థి శ్రీదేవిని మార్చాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యాల హేమాజీ డిమాండ్ చేశారు. బుధవారం కాసిపేట మండలం సోమగూడెంలో తన మద్దతుదారులతో కలిసి రాస్తారోకో చేశారు. నిర్మల్ జిల్లా ముథోల్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి పవార్ రామారావు పటేల్‌ను ఓడించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తానూర్ మండలంలోని కల్యాణి గ్రామంలో ఆమె కార్యకర్తలతో మాట్లాడుతూ పార్టీ అభ్యర్థిని చిత్తుగా ఓడించాలని కోరారు. భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలతో మాట్లాడి నిర్ణయిస్తానని ప్రకటించారు. ఖానాపూర్ టికెట్ ఇవ్వకుండా బీజేపీ తనను మోసం చేసిందని పెంబి జడ్పీటీసీ భూక్యా జానుబాయి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ఖానాపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గిరిజన మహిళకు పార్టీ ద్రోహం చేసిందని కంటతడి పెట్టారు. జగిత్యాల నియోజకవర్గ బీజేపీ టికెట్ తనకు ఎందుకు ఇవ్వలేదని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి అధిష్ఠానాన్ని ప్రశ్నించారు. జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ.. 12 ఏండ్లుగా బీజేపీ జెండాను మోసిన తనకు టికెట్ ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు.





ఖమ్మంలోని ఓ ఇంట్లో నిల్వ చేసిన గోడ గడియారాల బాక్స్‌లు. (ఇన్‌సెట్‌లో) పొంగులేటి ఫొటోతో ఉన్న గోడ గడియారం

# 'పొంగులేటి' గోడ గడియారాల సీజ్

- ఖమ్మంలో బంధువు ఇంటిపై ఫ్లయింగ్ స్క్వాడ్ దాడి
- రూ.46,89,310 విలువైన 9,570 వాచీల స్వాధీనం

ఖమ్మం/వేలేరు, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): శాసనసభ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నాలకు ఫ్లయింగ్ స్క్వాడ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు చెక్ పెట్టారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటీ కో-కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీప బంధువు, ఖమ్మంలోని దయాకర్‌రెడ్డి ఇంట్లో బుధవారం దాడులు చేశారు. రూ.46.89 లక్షల విలువ చేసే రూ.9,570 గోడ గడియారాలను అధికారులు సీజ్ చేశారని, ఆధారాలు చూపిస్తే వాటిని రిలీజ్ చేస్తామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సుమ తెలిపారు. దయాకర్‌రెడ్డి ఇంట్లో పెద్ద ఎత్తున గడియారాలు దొరకడం రాజకీయంగా కలకలం రేపుతున్నది. కాగా.. ఆ గడియారాలపై పొంగులేటి ఫొటోతోపాటు తన కూతురు వివాహం సందర్భంగా.. అని ముద్రించి ఉండటం పలు అనుమానాలకు తావిస్తున్నది.